క్లుప్తంగా

ర్యాగింగ్ నివారణపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నీలకంఠారెడ్డి

హిందూపురం టౌన్: పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నీలకంఠారెడ్డి అధ్యక్షతన ర్యాగింగ్ నివారణపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస రెడ్డి, సీనియర్ న్యాయవాదులు సిద్దు, కళావతి, సంతోషి కుమారి మాట్లాడారు. యువత ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి కేసుల్లో చిక్కుకుంటే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ధనుంజయ, ట్రైనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ శారద పాల్గొన్నారు.

విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు

హిందూపురం: పట్టణంలోని చైతన్య కాలనీలో ఉన్న మహిళా డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో శనివారం జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైన్స్ సామాజిక సమస్యలు పరిష్కరిస్తుందా? అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి హేమలత , ద్వితీయ స్థానం ఆర్.షాహిస్త అంజుమ్, తృతీయస్థానాలల్లో ఎస్.నవేరాబా దక్కించుకున్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా అధ్యాపకులు యశోదదేవి, హేమమారుతి, పోలయ్య, శ్రీలక్ష్మి, జేవీవీ ప్రతినిధులు రామకృష్ణ, ఓబులేసు వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రగతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

అగళి: మండల పరిధిలోని రామనపల్లి వద్ద శనివారం సాయంత్రం ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. వివరాలు.. బెంగళూరుకు చెందిన రాకేష్, శ్యామల లేపాక్షి దేవాలయం దర్శించుకున్నారు. తిరిగి కారులో బెంగళూరుకు వెళ్తుండగా.. హైవేలో రామనపల్లి వద్ద వెనుక టైర్ పంచర్ అయ్యింది. అతివేగంతో వెళుతున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కారులో ఉన్న ఇద్దరికీ దెబ్బలు తగిలాయి. వీరిని హుటాహుటిన ప్రైవేటు వాహనంలో కర్ణాటక శిర ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా.. రాకేష్, శ్యామలకు పెళ్లి కుదరడంతో దేవాలయాలను దర్శించుకుని వస్తుడంగా ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వీఆర్వో వెంకటలక్ష్మి సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభం



సామూహిక షిర్డీ సాయి సత్య వ్రతం ఆచరిస్తున్న మహిళలు

మడకశిర: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం గురుపౌర్ణమి వేడుకలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఆలయంలోని సాయిబాబా విగ్రహం ఎదుట మహిళలు సామూహిక షిరిడీ సాయి సత్య వ్రతం ఆచరించారు. బాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం పురవీధుల్లో బాబా విగ్రహాన్ని బంగారు పల్లకీలో ఊరేగించారు. సాయంత్రం ఆలయంలో జరిగిన షిర్డీ సాయి శాంతి మహాయజ్ఞంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మడకశిర: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ సూచించారు. శనివారం కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి అశోకుమార్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. అతి వేగం ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదకరమని హెచ్చరించారు.

జాబ్‌మేళా



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

పెనుకొండ: స్థానిక సత్యసాయి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం క్వ్యాంటాక్ట్, వికేర్, ఐసీఐసీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇంటర్వ్యూకు 54 మంది అభ్యర్థులు హాజరుకాగా ఆరుగురు అభ్యర్థులు ఏటా రూ.2.5 లక్షల నుంచి రూ.3.2 లక్షల ప్యాకేజీతో ఎంపికయ్యారు. ఎంపికయిన అభ్యర్థులను కళాశాల చైర్మన్ వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి, ఏఓ కేశవయ్య, బాబా, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రాబడికి ‘కత్తెర’

మొక్కజొన్న సాగు వివరాలు ఇలా..	
మండలం	మొక్కజొన్న సాగు (హెక్టార్లలో)
పరిగి	447
గోరంట్ల	786
హిందూపురం	458
లేపాక్షి	1311
చిలమత్తూరు	891
మొత్తం	3893



లేపాక్షి సమీపంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీలత, విస్తరణ అధికారి పుష్పలత



పంటను ఆశించిన కత్తెర పురుగు

లేపాక్షి: హిందూపురం వ్యవసాయ శాఖ పరిధిలో రైతులు మొక్కజొన్న పంట సాగుపై మక్కువ చూపుతున్నారు. అయితే మొక్కజొన్న సాగు చేసిన ప్రారంభంలోనే.. పంటకు కత్తెర పురుగు ఆశిస్తుండడంతో దిగుబడి తగ్గి రైతులు అప్పులు పాలవుతున్నారు. పలు రకాల మందులు కొట్టినా ప్రయోజనం లేకపోతోంది. దీంతో మొక్కజొన్న పంట సాగు చేయాలనుకున్న రైతులు ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సబ్సిడి ధరలకు మొక్కజొన్న విత్తనాలు, మందులు సరఫరా చేస్తే సాగుకు చేయడానికి రైతులు ముందుకు వచ్చే అవకాశం ఉంది

కత్తెర పురుగుతో నష్టం

లార్వా మొక్కజొన్న కాండం, ఆకులను, కంకిని తింటాయి. మొదటి దశ లార్వా ఆకులను తింటూ, ఆకులపై రంధ్రాలు చేస్తుంది. ఇటువంటి రంధ్రాలు ఆకులపై నిలువుగా కనిపిస్తాయి. లార్వా పెరుగుతున్న కొద్దీ సుడి నుంచి తింటూ, ఆకులను కత్తిరించినట్లుగా పూర్తిగా తినేస్తాయి. లార్వా కోశస్థ దశలోకి మారి చివరిగా రెక్కల పురుగుగా మారి గుడ్లు పెట్టి చనిపోతాయి. ఆ గుడ్ల నుంచి వచ్చిన లార్వాలు పంటను అధిక మోతాదులో నష్టపరుస్తాయి. దీంతో రైతులు పూర్తిగా నష్టపోతారు.

నివారణ ఇలా..

కత్తెర పురుగు ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు వేప సంబంధిత పురుగు మందులు పిచికారీ చేసి నివారించ వచ్చు. క్లోర్పిపైరిపాస్ 20 ఈసీ 400 మి.లీ. లేదా క్వినాల్ ఫాస్ 2 ఈసీ 400 మి.లీ.ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు అవసరాన్ని బట్టి థయోడికార్బ్(లార్వా) ఎకరానికి 300 గ్రాములు లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్(ప్రోక్లైన్) 5 ఎస్‌సీ 80 గ్రాములు ఎకరానికి లేదా రెనాక్సీనర్(కోరాజిన్) 60 మి.లీ. చొప్పున ఎకరానికి లేదా స్పైనోసాడ్ 45ఎస్‌ఈ (ట్రేసర్) 60 గ్రాములు ఎకరానికి మందులలో ఏదో ఒకటి పిచికారీ చేసి నివారించుకోవచ్చు.

ఎకరాకు రూ.30 వేలు ఖర్చు చేశా



ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంటకు కత్తెర పురుగు సోకడంతో నివారణ కోసం ఎకరాకు రూ. 30 వేలు ఖర్చు చేశాను. ప్రస్తుతం మొక్కజొన్న క్వింటా రూ. 2,500 గిట్టుబాటు ధర ఉంది. బాగా దిగుబడి వస్తే ఖర్చులు పోనూ ఎకరాకు రూ. 5000 మిగులుతుంది. దిగుబడి రాకపోతే పెట్టిన పెట్టుబడి కూడా రాదు.

–జయరామప్ప, లేపాక్షి

నాలుగు ఎకరాల్లో సాగు చేశా



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ప్రారంభ దశలోనే పంటకు కత్తెర పురుగు ఆశించింది. ఈ పురుగు నివారించడానికి ఇప్పటి వరకూ మందులకు, వ్యవసాయ ఖర్చు రూ. 70 వేలు వరకూ ఖర్చు వచ్చింది. కనీసం పంటసాగుకు పెట్టిన ఖర్చులైన వస్తాయో లేదోనని అనుమానంగా ఉంది.

–రామక్రిష్ణారెడ్డి, రైతు, సంజీవరాయునిపల్లి

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



హిందూపురం వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో రైతులు 3,893 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారు. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకడంతో.. నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులకు కావాల్సిన మందులు, సూచనలు, సలహాలు ఇవ్వాలని ఇప్పటికే ఆయా మండలాల్లో వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఆదేశాలిచ్చాం.

–అల్తాఫ్ అలీఖాన్ ఏడీఏ, హిందూపురం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



జెరిగేపల్లిలో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి షమియుల్లా

రొళ్ల: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మడకశిర మలేరియా సబ్ యూనిట్ అధికారి షమియుల్లా పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని జెరిగేపల్లిలో డెంగీ నివారణ మాసోత్సవాల సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలో ప్రవహిస్తున్న మురికి నీటిని శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులతో దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయించారు. అనంతరం ప్రజలతో నిర్వహించిన సమావేశంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి షమియుల్లా మాట్లాడారు. ఇంటి పరిసరాల చుట్టు పక్కల చిప్పలు, పగిలిన సీసాలు, ప్లాస్టిక్ బిందెలతో పాటు పూల కుండీలు, రక్షిత మంచినీటి ట్యాంకులు, సంపుల్లో నిల్వ ఉన్న నీటిని వారానికి ఒకసారి తొలగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో దోమ తెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. దోమకాటుతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అహల్యా, ఏఎన్ఎం భాగ్యజ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, ఆరోగ్య కార్యకర్త చంద్రశేఖర్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహం భవితకు అవరోధం



కోగిరలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రొద్దం: బాల్య వివాహం భవితకు అవరోధమని సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. శనివారం స్థానిక జెడ్పీహైస్కూల్‌లో ఆర్డీటీ, ఐసీడీఎస్ సంయుక్తంగా బాలల హక్కులు, బాల్య వివాహాలు, వాటి అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఆడపిల్ల పుట్టింది అంటే ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని సంబరపడతారన్నారు. అయితే చిన్నవయసులోనే వారికి పెళ్లి చేసి భారం తగ్గించుకోవాలని కొందరు తల్లిదండ్రులు ఆలోచిస్తుంటారన్నారు. చిన్నవయసులో పెళ్లి చేస్తే వారి జీవితాలు నాశనమవుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు జరిగితే 1098, 100, 112 టోల్ ఫ్రీ నంబర్లరు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ సుధాకర్, పాఠశాల హెచ్ఎం నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది విజయలక్ష్మి, రేణుకాబాయి, రమాదేవి, ఆర్డీటీ మహిళ విభాగం టీం లీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, మహిళా పోలీస్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సోమందేపల్లి: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు పంట పెట్టుబడి సాయం రూ.20 వేలు చొప్పున వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు.ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అందజనాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావొస్తున్నా పంట పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం సరికాదన్నారు. పంటల బీమా అమలు, కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయంతో పాటు వ్యసాయానికి ఉచిత విద్యుత్ అందించాలన్నారు. తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయే రైతులను ఆదుకోవాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి రంగప్ప, నాయకులు హనుమయ్య, కిష్టప్ప, శీలా రంగప్ప, రామకృష్ణ తదితరుల పాల్గొన్నారు.

సాయినాథుడికి పిండి వంటల నైవేద్యం



108 రకాల పిండివంటలు సాయినాథుడికి సమర్పించి పూజలు చేసిన దృశ్యం

హిందూపురం: స్థానిక సత్యనారాయణపేటలో వెలసిన షిరిడీ శేష సాయి సంస్థాన్ సాయి మందిరంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని ఆలయ 12వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయంలో షిరిడి సాయి నాధుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేషాలంకరణ చేసి పూజలు చేశారు. ఉదయం 8 గంటలకు 108మంది ముత్తైదువులు 108 రకాల పిండి వంటల నైవేద్యాలతో ఊరేగింపుగా వచ్చి ఆలయంలో మూలవిరాట్‌కు సమర్పించారు. 21వ తేదీ సాయినాథుడికి మంచామృతాభిషేకాలు, కాగడ హారతి అనంతరం 7 గంటల నుంచి 10 గంటల వరకూ క్షీరాభిషేకం నిర్వహించనున్నారు.

22న ‘డయల్ యువర్ డీఎం’

హిందూపురం: హిందూపురం ఆర్టీసీ పరిధిలో 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం శ్రీకాంత్ శనివారం తెలిపారు. డిపో పరిధిలో బస్సుల సదుపాయలు, రవాణా సౌకర్యం . ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నేరుగా డిపో మేనేజర్‌కు తెలియజేయాలన్నారు. హిందూపురం డిపో పరిధిలోని ప్రజలు 9959225858 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

అయోధ్య కాశి యాత్రకు బస్సు సదుపాయం

హిందూపురం డిపో నుంచి ఏపీఎస్ఆర్టీసీ అయోధ్య, కాశి 14 పుణ్యక్షేత్రాలు దర్శించేందుకు ఎనిమిది రోజుల యాత్ర ఏర్పాటు చేసింది. ఈ యాత్రకు ఒక్కక్కరికి టికెట్ ధర దానుపోను రూ.8,500 నిర్ణయించింది. ఆగస్టు 9, ఆగస్టు 20 తేదీల్లో ఈ ప్రత్యేక యాత్ర బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. టికెట్లు కావలసిన వారు 9440834715 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

23న న్యాక్ బృందం రాక

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం ఈ నెల 23, 24 తేదీల్లో సందర్శించనున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు శనివారం తెలిపారు. న్యాక్ గ్రేడింగ్‌తో కళాశాలకు హోదాపరంగా, ఆర్థికంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కళాశాల ప్రణాళిక, అభివృద్ధి మండలి సభ్యులు, పూర్వ విద్యార్థులతో న్యాక్ బృందం సమావేశమవుతుందన్నారు.

శాకంబరి అలంకరణలో వాసవీమాత



పెనుకొండ: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసంలో వాసవీమాతను శాకంబరిగా అలంకరిస్తే శుభాలు జరుగుతాయన్నది ఆర్యవైశ్యుల నమ్మకం. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్యులు సుధాకర్‌గుప్తా, సూర్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన న్యాయమూర్తి



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

పెనుకొండ: పట్టణంలోని సబ్‌జైలును జూనియర్ సివిల్ జడ్జి బొజ్జప్ప శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఖైదీలతో సమావేశం ఏర్పాటు చేసి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. అవసరమున్న వారికి న్యాయ సహాయం అందిస్తామన్నారు. భోజనసామ్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి సబ్ జైల్ పరిసరాలను పరిశీలించారు. సబ్‌జైల్ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయానికి విరాళం



రూ.లక్ష విరాళం అందిస్తున్న నవీన్‌నిశ్చల్

హిందూపురం: పట్టణంలోని రైల్వేగేట్ సమీపంలో ఉన్న డీపీ కాలనీ సాయిబాబా ఆలయం వద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఏపీ ఆగ్రోస్ మాజీ చైర్మన్, శ్రీసత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న సాయి బాబా ఆలయ కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో భక్తుల సదుపాయంతోపాటు పూజలు, భక్తి సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించడానికి అనుకూలంగా నిర్మాణం చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా ఆంజనేయ స్వామి చిన్న రథోత్సవం



రథానికి పూజలు చేస్తున్న భక్తులు

పావగడ: ఆరసికెరె గ్రామంలో గుజ్జారి ఆంజనేయ స్వామి చిన్న రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు రథంపై కొలువుదీరిన ఆంజనేయస్వామికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి శ్రీరాముడి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామంలో శనివారం తాడి నాగమ్మకు గ్రామోత్సవం నిర్వహించారు. గుర్రపుకొండ గ్రామం నుంచి తాడినాగమ్మ ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. వర్షాలు కురిసి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామానికి మంచి జరుగాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: గొల్లపల్లి గ్రామంలో మొహర్రం వేడుకల్లో భాగంగా శనివారం పీర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. పీర్లను పూలతో అలంకరించి గ్రామవీధుల్లో ఊరేగించారు. భక్తులు పీర్లకు చెక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సూర్య ప్రకాశ్‌రెడ్డి, కర్రా సంజీవరెడ్డి, సంజీవరెడ్డి, సుబ్బిరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామిసేవలో డీఎస్పీ

రొళ్ల: మండల పరిధిలోని కొత్తపాళ్యం గ్రామంలో వెలసిన వెంకటేశ్వరస్వామిని శనివారం సాయంత్రం కళ్యాణదుర్గం సబ్ డివిజన్ డీఎస్పీ బి.శ్రీనివాస్ దర్శించుకున్నారు. డీఎస్పీకి ప్రధాన అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామికి విష్ణు సహస్ర నామాలు, అష్టోత్తర నామాలు, అంకురార్పణ, కుంకుమార్చన ఇతరాత్ర పూజలు చేశారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాస్‌కు మహామంగళారతి ఇచ్చి తీర్థప్రసాదం, పండ్లు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

సేవాభావం అలవర్చుకోండి

పావగడ: ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని సీవి సురేశ్ సూచించారు. శనివారం తాలూకాలోని దొమ్మతమరిలో ఎన్ఎస్ఎస్ వార్షిక విశేష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ కళాశాలలో కేవలం చదువే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యోజనాధికారి రామాంజిని, కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

మడకశిరరూరల్: మండలంలోని యూ.రంగాపురం సమీపంలో శనివారం పెను ప్రమాదం తప్పింది. ఇసుకతో యూ.రంగాపురం ప్రధాన రోడ్డు పైకి ట్రాక్టర్ వచ్చింది. ఆ సమయంలో కేఎస్ఆర్టీసీ బస్ అకస్మాత్తుగా రావడంతో బస్సును తప్పించే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

స్థలం కబ్జా ఆరోపణలు అవాస్తవం

గోరంట్ల: మండలపల్లిలో తాము స్థలాన్ని కబ్జా చేసినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తమని మండలపల్లి సర్పంచ్ ప్రమీలమ్మ, ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నేత మునిలిరెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలపల్లి రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 297–2లో తమ పూర్వీకులు 1929లో 20.5 సెంట్ల స్థలం కొనుగోలు చేశారన్నారు. ఇందులో 2005లో కొంత భాగం రేషం షెడ్డు నిర్మించామని, మిగతా స్థలం ఉంటే ఇటీవల కంచె వేశామన్నారు. అయితే తమ గ్రామానికి చెందిన టీడీపీ నేత కన్నరెడ్డి వారసులు, మరి కొందరికి ఇదే సర్వేనంబరులోని కొంత భూమిపై కోర్టులో వివాదం నడుస్తోందన్నారు. తమ స్థలం విషయంలో వారికి ఎలాంటి వివాదం లేదన్నారు. పోలీసులు స్థలాన్ని పరిశీలించిన తర్వాతే తాము కంచె వేశామన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్ళి పంచాయతీలోని గ్రామాల్లో దెబ్బతిన్న వాటర్ స్కీమ్ పైపులైన్లకు మరమ్మతులు చేసి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి సావిత్రి, డిజిటల్ అసిస్టెంట్ చంద్ర తెలిపారు. శనివారం వారు జమ్మానిపల్లి గ్రామంలో పర్యటించారు. దెబ్బతిన్న వాటర్ స్కీమ్ పైపులైన్ ద్వారా నీరు లీకేజ్ కావడంతో తాగునీరు కలుషితం అవుతున్నాయని గ్రామ ప్రజలు వివరించారు. దెబ్బతిన్న పైపులైన్‌కు వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. వాతావరణం మార్పుతో వ్యాధులు సోకే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇంటి వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

తాగునీరు సక్రమంగా అందించాలి

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం వద్ద ఉపాధి హామీ పనుల్లో భాగంగా మొక్కలు నాటడానికి తీసిన గుంతలను ఎంపీడీఓ భాస్కర్ శనివారం పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటితే బాగా ఎదుగుతాయన్నారు. అలాగే మండలంలోని వి.అగ్రహారం, మద్దనకుంట, కాచికుంట, కెంకెర పేలుబండ గ్రామాల్లో శ్రీరామిరెడ్డి పథకం ద్వారా ప్రజలకు అందిస్తున్న తాగునీటిని సక్రమంగా అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంప్ ఆపరేటర్లు, తాగునీటి లైన్ ఆపరేటర్లు సక్రమంగా తాగునీటిని అందించాలని ఆదేశించారు. వీరితో పాటు ఏపీఓ జగదీష్, టీఏ.హనుమంతరాయ తదితరులు ఉన్నారు.

కవితా సంకలనం విడుదల

పావగడ: శిర ప్రాంతానికి చెందిన గణిత ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి మధు శ్రీనివాసన్ రచించిన ‘ఇద్దంగిరదు’ (ఉన్నట్టుండదు) అనే కవిత సంకలన పుస్తకాన్ని తుమకూరు విశ్వ విద్యాలయం సహోధ్యాపకుడు డా.నాగభూషణ్ బగ్గనడు ఆవిష్కరించారు. స్థానిక పీయూ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కవితలు చదవడం, రాయడం ప్రారంభించారంటే అతను మనిషి అవుతున్నాడని అర్థమన్నారు. సాహిత్యం మనుషుల్లో మానసిక స్థితి గతులను మార్చి మానవీయ విలువలు రూపొందిస్తుందన్నారు. కవితలు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మధుగిరి విజ్ఞాన కేంద్రం ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, ప్రిన్సిపాల్ కంపలప్పచన్నసాగర, కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, హోమా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి కృషి

సోమందేపల్లి: మండలంలో చేనేతల సంక్షేమానికి కృషి చేస్తానని తొగట వీర క్షత్రీయ సంఘం అధ్యక్షుడు సి.సి.హరి తెలిపారు. అధ్యక్షుడిగా హరి ఎంపిక కావడంతో శనివారం ఆయనను సంఘం నాయకులు కలిసి శాలువా కప్పి పూల మాలలతో సత్కరించారు. పార్టీలకు అతీతంగా తాను సంఘాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తొగట వీర క్షత్రీయ సంఘం నాయకులు పల్లా నరసింహా, నరేష్, అశోక్, లోకేష్, శ్రీకాంత్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.